చేదుకోరిక....

"సిస్టర్! పిలిచింది రేవతి.

రేవతికి ఇంజక్షన్ చేసి వెళుతున్న నర్సు వెనక్కి తిరిగి చూసింది

"సిస్టర్! నీపేరేమిటో? నాకో సాయం చేస్తావా?"

"ఏం కావాలి?"

"చేస్తానంటేనే అడుగుతాను కాదన కూడదు." చేతులు జోడించబోయింది

"ఊహూఁ! ఏమిటో చెప్పు!"

రేవతి కళ్ళు మూసుకుంది. ఆమె ముఖం ఎంతో నిర్మలంగా వుంది. వణుకు తున్న స్వరంతో అంది

"ఏమీలేదు నాకు శాశ్వతంగా కన్ను మూసే ఇంజక్షనొకటివ్వు!"

నర్సు బాధగా రేవతివేపు చూసింది

"సిస్టర్!"

"ఇలాగైతే నీ దగ్గరకేరాను" అంటూ కదలబోయింది

రేవతి లేచి గభాల్న నర్సు చెయ్యి పట్టుకుంది కళ్ళవెంట వర్షంలా నీరు నర్సు మనసు మెత్తబడింది "తప్పు రేవతీ! అలాంటి మాటలు అనకూడదు పిచ్చి ఆలోచనలు మాని విశ్రాంతి తీసుకో." అంటూ చేయి విడిపించుకోబోయింది.

"వద్దు సిస్టర్! నన్ను వదిలిపోకు నేను బ్రతకడం అనవసరం" వణికిపోతూ అంది రేవతి.

ఏదో బలీయమైన కారణమే వుందని వూహించి, "అవును రేవతీ! మీ వాళ్ళె వరూ రాలేదేమిటీ!" అన్నది నర్సు

ఆ మాటతో రేవతి ముఖం వాలిపోయింది వణుకు పుట్టుకొచ్చింది. నర్సు చేతిని వదిలి చేతులతో ముఖం కప్పుకుని భోరున ఏడ్చింది

నర్సు తేరుకుని "నీ భర్త కూడా రాలేదేం?" అడిగింది జాలిపడుతూ—

"సిస్టర్! నా భర్తరాడు, తల్లీ, తండ్రీ ఎవ్వరూ రారు మా కుటుంబంలో నా పేరు మాసిపోయింది నేను చచ్చిన దాంతో సమానం. ఇంకా నేను ఎందుకు బ్రతకాలి?"

"చూడు రేవతీ! చచ్చి సాధించేదేమీ లేదు పరిస్థితులెప్పుడూ ఒకేలా వుండవు నీ భర్త తప్పకుండా వస్తాడు. ధైర్యంగా వుండు" నచ్చచెప్పింది భర్త సరిగా చూడ్డం లేదనుకుని.

"లేదు సిస్టర్! నా భర్తరాడు. ఎవ్వరూరారు వస్తారని ఆశలేదు గాలి పటం తాడు తెగితే ఎక్కడో రాలిపోతుంది. చివరికి చీలికలై పోతుంది. అది ఎవరికీ పనికిరాదు. అంతే సిస్టర్! అంతే"

రేవతి దుఃఖం, ఆమె జబ్బు పరిస్థితి నర్సు హృదయాన్ని కలిచివేశాయి రేవతి పరిస్థితిని అర్థంచేసుకుంది కాని తనేమీ చెయ్యలేదు. ఆమెను చేర్పించిన డాక్టరుతో మాట్లాడితేగాని అసలు విషయం తెలియదు అనుకుంది రేవతి చేయి నిము

నిమ్మగడ్డ రామలింగేశ్వరరావు

రుతూ నర్సు

అప్పటికే అలిసిపోయిన రేవతి కను రెప్పలు మూతపడుతున్నాయి. మెల్లగా నడిచి బయటకు పోయింది నర్సు సుహాసిని.

"రేవతీదేవిగారూ?"

రేవతికి ఎక్కణ్ణించో, ఎంతో దూరం నించి పిలిచినట్టుందా పిలుపు. ఆ పిలుపులో ఆర్ద్రత, ఆప్యాయత, అభిమానం పుట్టి పడుతోంది ఆ పిలుపు రేవతి హృదయాన్ని సున్నితంగా తాకింది. కళ్ళు తెరిచి చూసింది ఎదురుగా డాక్టరు. మెడలో స్టెత్ తగిలించుకుని ఎంతో హుందాగా వున్నాడు

చిరునవ్వుతో తనవేపు చూస్తున్నాడు ఆ చిరునవ్వు చూశాక రేవతి మనసులో ఆందోళన బయలుదేరింది అలాంటి చిరునవ్వు, అందం, అభిమానం చూసే తనారోజు మురిసిపోయింది. గతం తలుచుకునే సరికి వళ్ళు గగుర్పొడిచింది. అమావాస్య చీకటిలా భయం ఆవహించింది. వణుకుతూ గట్టిగా కళ్ళు మూసుకుంది.

* * *

రేవతి చలాకీ పిల్ల. హైస్కూల్లో ఆమె అందాన్ని ఆరాధించని రోమియోలు లేరు. అదుపుతప్పిన గడుగ్గాయిలు ఆమె చేతి దెబ్బను రుచి చూశారు

దోవన పోయే మనుషుల్ని నిలేసే అందం రేవతిది

అన్ని హంగులూ వున్న ఆడపిల్ల రేవతి.

అందరి అభిమానాన్ని సంపాదించిన స్టూడెంటు రేవతి.

రేవతి ఆడపిల్లలకి లీడరు. మగపిల్లలకి కమాండరు. ఆమె ఆడింది ఆట పాడింది పాటగా జరిగిపోయింది హైస్కూలు జీవితం

కాలేజీలో చేరాక రేవతిలో పెద్ద మార్పే వచ్చింది వయసులో ఆలోచనల్లో ప్రవర్తనలో అందంలో మార్పు

ఇప్పుడు రేవతి వూహా ప్రపంచంలో విహరిస్తోంది ఆమె కలలుకనే కళ్ళుచూసి అబ్బాయిలు కలలు కన్నారు. ఆమెను ప్రేమించాలనీ, ప్రేమించబడాలనీ ఆరాట పడ్డారు చాలామంది

ఎవరికీ అందని ఆశ రేవతి

అందరి మనసూ రేవతి మీద వుంటే, రేవతి మనసు ఆకాశంలో విహరించేది. తన అందం ఏ సినిమా స్టార్సకీ తీసిపోదని రేవతి నమ్మకం చరిత్ర ప్రసిద్ధి పొందిన అందకత్తెలు తనకంటే ఏమీ ఎక్కువకాదని ఆమె గర్వం సినిమా హీరోయిల్నందరినీ పోల్చుకోడం ఆమె హాబీ

ఓనాడు రేవతి తన క్లాస్‌మేట్ రమ పెళ్ళికి వెళ్ళింది. రమ ధనవంతుల బిడ్డ. ఓ డాక్టరు కిచ్చారు. పెళ్ళికొడుకు అందగాడే రేవతికతడు బాగా నచ్చాడు. అతనిలో ఏదో ప్రత్యేకత కనిపించింది. పెళ్ళయాక రమని తీసుకుని అమెరికా వెళతాడని తెలుసుకుంది.

రేవతి ఆలోచించింది. తను గూడ ఓ మంచి, అందగాడైన డాక్టర్ని చేసుకుంటే? ఆవును తనుకూడ అమెరికా వెళ్ళవచ్చు. అనుకోగానే వళ్ళు పులకరించింది విమానంలో ప్రయాణం చేస్తున్నట్టే వూహించుకుంది ఇండియాలో పుట్టి అమెరికాలో జీవితం ఓహ్! ఎంత హాయి! అమెరికా జీవితమే జీవితం ఇండియాలో ఆడది ఓ బానిస మొగుడికో పనిమనిషి. విలాస వస్తువు

తను చేసుకుంటే డాక్టర్నే చేసుకోవాలి. అమెరికా వెళ్లాలి. జీవితం అనుభవించాలి నిశ్చయించుకుంది రేవతి

రేవతి ఎరువుల వ్యాపారి రంగనాథం పెద్ద కూతురు రేవతికి తండ్రిదగ్గర బాగా చనువు. మాటల సందర్భంలో తన వుద్దేశం వెలిబుచ్చింది మొదట రంగనాథం నిరుత్సాహపడలేదు. ఎరిగున్న వాళ్ళందరికీ చెప్పాడు డాక్టరుకోర్సు చదివేవాళ్ళ లిస్టు దగ్గరుంచుకుని మరీ తిరిగాడు ఫలితం శూన్యం కొండకి నిచ్చెన వేశాననుకున్నాడు కూతురి కోరికల మధ్య, పెళ్ళి కొడుకుల డిమాండ్‌ల మధ్య నలిగిపోయాడు రంగనాథం

రేవతి కాలేజీ చదువు పూర్తయింది రేవతి కోర్కె అలాగే మిగిలిపోయింది

తల్లీ, తండ్రీ పోరగా ఓ సంబంధానికి వప్పుకుంది రేవతి. అతడే లాయరు ప్రభాకరం. ఒక్కవృత్తి తప్ప రేవతి కోరుకున్నవన్నీ అతడికున్నాయి మంచి రంగు, వెడల్పాటి కళ్ళు, నిండైన విగ్రహం అతనిది ఖద్దరులాల్చీ, పట్టంచు ధోవతీ, కాళ్ళకి చెప్పులు ఆకర్షణీయంగానే వుంది అతని డ్రెస్. కాని ఫుల్‌సూటులో

వుంటాడనుకున్న రేవతికి నిరాశే ఎదురయింది

చూపుల తతంగం ఐపోయాక ప్రభాకరం ఓ కె అన్నాడు.

రేవతి డైలమాలో పడింది

ప్రభాకరం బాగా ప్రాక్టీసు వున్న లాయరు. రెండుచేతులా సంపాదిస్తున్నాడు ఓ మేడ, కారు అన్నీ హంగులూ వున్నాయి కాని డాక్టరు కాదు అమెరికా వెళ్ళే యోగంలేదు డాక్టర్లు చాలా ఖరీదైన వాళ్ళు. తన కందరు. ఎటూ తేల్చుకోలేక సతమతమయిపోయింది.

అది గ్రహించిన రేవతి తండ్రి "తల్లీ! నీ కోర్కె తప్పుకాదు, కాని మన పరిస్థితిని బట్టి ఆలోచించుకోవాలి సుఖంగా జీవించడమనేది కేవలం వృత్తిమీదనే ఆధారపడి వుండదమ్మా! భార్యాభర్తల అనురాగం, సంస్కారం మీద ఆధారపడి వుంటుంది. ఇక నీ యిష్టం. చదువుకున్నదానివి జ్ఞానం తెలిసిన పిల్లవు ఆలోచించు" బోధించాడు రేవతికి. రేవతి తల్లికి బోధించడం చాతగాక కూతురు మీద విసుక్కుంది కూతురు ఎక్కడ కాదంటుందోనని భయపడి, ఇంత మంచి సంబంధం ఇక నీ జన్మలో రాదని గట్టిగా చెప్పింది.

రేవతి సతమతమయిపోయింది తండ్రి మాటలు వాస్తవమని తోచాయి తన కోర్కె తీరేదికాదని తెలుసుకుంది

"ఏమని కబురుచెయ్యమంటావు తల్లీ!" అని తండ్రి అడగ్గానే రేవతి తలూపింది సమ్మతమే నన్నట్టుగా

* * *

రేవతి అత్తవారింట అడుగుపెట్టాక

తన జీవిత ప్రణాళికలో మొదటి భాగము హనీమూన్. మొదట దక్షిణాది ప్రాంతం చూడాలని వుబలాటపడింది. ఆ తరవాత ఉత్తరాది ప్రాంతం తిరిగి నిండుపున్నమి వెన్నెల్లో తాజ్‌మహల్ అందాన్ని ఆస్వాదించాలనుకుంది. అనుకుందే తడవుగా భర్తని అడిగింది "ఏమండీ! ఇద్దరం కలిసి అటు మైసూరు చూసి వద్దామండీ. అటు హనీమూన్ పోయివచ్చి నట్టుంటుందీ, ఇటు మీకు కాస్త విశ్రాంతి దొరికి నట్టుంటుంది."

ప్రభాకరం ఓ నిమిషం ఆలోచించి "నీ కోర్కె సబబే కాని- ఇక్కడ ఓ ముఖ్యమయిన కేసు వుంది ఇప్పుడు వీలు పడదు. ఇక కోర్టుకు సెలవు లిచ్చినపుడే సాధ్యమవుతుంది" అన్నాడు ప్రభాకరం.

ఆ సమాధానం రేవతికి రుచించలేదు. భర్త తన మాటకు విలువనివ్వకపోవడం తన్నవమాన పరచడమేనని భావించింది రేవతి

'ఏమిటీయన తత్వం? పొద్దుట లేవడం ఆలస్యం పార్టీలు వచ్చి కూచుంటారు. గొంతులో కాఫీ గొంతులో వుండగానే ఆఫీసురూములో జొరబడతాడు. ఇక కోర్టుకు పోయే టైముకి హడావిడిగా వచ్చి భోజనంచేసి కోర్టుకు వెళతాడు కోర్టునుంచి రాగానే మళ్ళీ పార్టీలు, కేసులు మళ్ళీ మామూలే. భార్య ఒంటరిగా వుంటోందనే ధ్యాసే వున్నట్టు కనిపించదు. కనీసం రాత్రిపూటయినా సర్దాగా మాట్లాడదామంటే కూడ వీల్లేకపోతోంది. భార్య భర్తల అనుబంధం లేదు. ఆత్మీయత లేదు. ఆయనకోసం ఎదురు చూసీ, చూసీ విసుగు పుడుతోంది. అసలు తనంటే ప్రేమ వుందా? తన అందం భర్తని ఆకర్షించలేకపోతోందా? లేక అందాన్ని అనుభవించడం ఆయనకి తెలియదా? ఏదో అనుమానం తన అందమంతా వృధా పోతోందే అని బెంగ-' ఇలా ఎన్నో వూహించింది రేవతి

ఓ రోజు హఠాత్తుగా జబ్బు చేసింది రేవతికి హాస్పిటల్లో చేర్చారు డాక్టర్ కృష్ణమోహన్ శ్రద్ధవల్ల త్వరగానే కోలుకుంది. ఇంటికి వచ్చాక కూడ డాక్టర్ వచ్చి చూసిపోతూ వుండేవాడు కొద్ది కాలంలోనే అనారోగ్యం నుంచి కోలుకుంది.

డాక్టర్ కృష్ణమోహన్, లాయరు ప్రభాకరం స్నేహితులు అతనికింకా పెళ్ళి కాలేదు తెలివిగలవాడు. అందగాడు

డాక్టరు కృష్ణమోహనంటే రేవతికి ఏదో అభిమానం. అతని ప్రవర్తన, అందం, రేవతి అభిమానాన్ని పెంచింది.

"రేవతీ దేవిగారూ! మీ అందాన్ని చూస్తుంటే మీరు పూర్వజన్మలో ఏ దేవతో అయివుంటారు అనిపిస్తోంది. విధివశాత్తు మానవుల్లో పుట్టారు మిమ్మల్ని చేసుకున్న లాయరుగారు అదృష్టవంతుడు" అన్నాడు కృష్ణమోహన్ ఒకసారి

రేవతి వళ్ళు పొంగిపోయింది మనసు ఉరకలు వేసింది రక్తం వేడెక్కింది 'ఈనాటికి కదా తన అందానికి గుర్తింపు' అని తన్మయత్వం చెందింది. డాక్టర్ని ఆరాధనా భావంతో చూసింది "డాక్టర్!" అన్నది.

ఆ పిలుపులో (ఏదో) మార్దవం, ఆరా



ధన వినిపించింది డాక్టర్ కృష్ణమోహన్‌కు అలాగే రేవతి కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు. ఆనాటినుంచీ రేవతి మనసంతా కృష్ణమోహన్ ఆక్రమించుకున్నాడు. ఇద్దరు స్వర్గంలో విహరిస్తున్నట్టు వూహించింది రేవతి. తన కలలు నిజమయినట్టు తృప్తి పడింది.

తాత్కాలికంగా అణిగిపోయిన రేవతి కోర్కెలు తలెత్తి బుసలుకొట్టాయి ప్రభాకరం ఉదాసీనత నిప్పుకి గాలిలా తోడయింది ఇప్పుడు డాక్టరు ఓ మన్మధుడిలా కనిపిస్తున్నాడు రేవతికి. ప్రభాకర్ వ్యక్తిత్వం మరుగున పడిపోయింది. డాక్టర్ ఉనికి రేవతిని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది

ప్రభాకరం ఓ కేసులో తీరికలేకుండా పనిచేస్తున్నాడు. రేవతికి ఏలోటూ జరక్కుండా చూస్తూనే వున్నాడు. డాక్టర్ కృష్ణమోహన్ రేవతి ఆరోగ్యం గురించి శ్రద్ధగా చూస్తున్నాడని నమ్మకంతో తన పనులు చేసుకోవడంలో మునిగిపోయాడు ప్రభాకరం

ప్రభాకరం తన పనుల్లో మునిగిపోయి వుండడం, కృష్ణమోహన్ నిత్యం వస్తూ తన దగ్గరే వుండడం, ఆరాధనతో కూడిన పొగడ్త లందించడంతో, ప్రభాకరం గురించి ఆలోచించడమే మరిచిపోయింది రేవతి. పైగా ప్రభాకరం తన గొడవే పట్టించుకోడం లేదనే ఉద్దేశ్యం బాగా బలపడిపోయింది. ఇప్పుడు రేవతి మనసులో కృష్ణమోహన్ చోటుచేసుకున్నాడు.

రేవతి, కృష్ణమోహన్‌ల మధ్య అభిమానం, ఆత్మీయత పెరిగింది. మనసులు దగ్గరయాయి.

ప్రభాకరం తన మెడలో మూడు ముళ్ళు వేశాడు. తన అందంతో కృష్ణ

మోహన్‌కి ముప్పయి ముళ్ళు వేశానను కుంది. రేవతి కృష్ణమోహన్ చేతుల్లో గాలిపటమయిపోయింది. పటాన్ని ఎగర వేశాడు కృష్ణమోహన్. ఆడించాడు. ఆడీ, ఆడీ తాడు తెగింది.

పటం చిరిగి చీరికలై కింద పడిపో యింది.

*　　*　　*

"రేవతీదేవిగారూ! కళ్ళు తెరవండి" పిలిచాడు డాక్టర్ ఉలిక్కిపడి కళ్ళు తెరి చింది. డాక్టర్ వేపు చూసింది కన్నీళ్ళు కారుతున్నాయి చెక్కిళ్ళమీదుగా.

డాక్టర్ చలించిపోయాడు. "ఏడుస్తు న్నారా? ఈ పరిస్థితుల్లో మీరు బాధపడ కూడదు. ధైర్యంగా వుండాలి ఇంటికి పోయి మందులు తీసుకుంటూ రెస్ట్ తీసు కోండి. మందులు రాశాను" చీటీ ఇచ్చి కదిలిపోయాడు భారంగా

జరిగిపోయింది తలచుకోగానే వళ్ళు మొద్దుబారినట్టయింది గుండెల్లో నొప్పి ప్రారంభమయింది ఈ జబ్బు నయ మయేది కాదని అర్థమయిపోయింది. ఏమిటి చెయ్యడం! ఏది దారి? ఎందుకీ మందులు? అసలు బ్రతకడం ఎవరికోసం? ఎవరున్నారని!—అనుకోగానే దుఃఖం కట్టలు తెంచుకుంది.

మళ్ళీ ఆలోచన ఏం చెయ్యాలి తను? ఇక తనకెవరున్నారు? తండ్రి దగ్గరా, భర్త దగ్గరా తనకు స్థానంలేదు! ఎవరైనా వస్తారా తనకోసం? ఏదో ఆశ మినుకు మినుకుమంటోంది. ఏమో! అసలు తనిక్కడ వున్నట్టు తెలియదేమో? తెలిస్తే మాత్రం వస్తారని నమ్మక మేముంది? తన భర్త తన కోసం రావడం అసంభవం ఆడది ఒక్కసారి కాలు జారితే ఫలితం ఏమిటో తనకు తెలిసి పోయింది. తనకు యెక్కడా స్థానంలేదు. అభిమానం ఆస్తిగా గల తండ్రి అసలు రాడు

ఒక్కసారి రేవతి మనసు భర్త, ఇల్లు సంసారం, తల్లి, అన్నిటినీ తొంగి చూసింది

భర్త మళ్ళీ పెళ్ళిచేసుకుని వుంటాడు. పిల్లలు కూడ కలిగివుంటారు. ఎంత చక్కని పిల్లలు పుట్టారో? అనుకోగానే వళ్ళు జలదరించింది రేవతికి ముఖం మబ్బు కమ్మినట్టయింది. మనసు అటే పోయింది. ఎవర్ని చేసుకున్నాడో? ఆ భాగ్యశాలి ఎవరో? ఒక్కసారి పోయి చూస్తే? పోతే ఆవిడ వూరుకుంటుందా? ఎవరివని అడిగితే ఏం చెప్పాలి? నేను ఫలానా అని చెప్తే వూరుకుంటుందా? భర్త మాత్రం ఎందుకూరుకుంటాడు? జుట్టు లంకించుకుని ఈడ్చివేస్తాడు మెట్ల మీదినించి దొర్లుతుంది తను చచ్చి పోతుంది

ఆలోచనల మధ్యలో తన జీవితానికి ఏదో పరిష్కార మార్గం దొరికినట్లయింది రేవతికి.

ఒక్కసారి లేచి పైకిపోయే మెట్లు ఎక్కడున్నాయో చూస్తే బాగుండునను కుంది. లేచే ఓపిక లేదు దూరంగా ఎక్కడో పసిపిల్ల ఏడుపు వినిపించింది కామన్ హాల్లోంచి ఎవరిదో మూలుగు



సన్నగా వినిపిస్తోంది కళ్ళు మూసుకుంది

నిశ్శబ్ద వాతావరణంలో ఏవో అడుగుల చప్పుడు వినిపించింది. చెవులు రిక్కించి విన్నది

అడుగులు పరిచయమైనవిలాగే వున్నాయే? ఎవరో చూడాలి కళ్ళు తెరవాలనుకుంది. తెరవలేకపోయింది అడుగులు మంచం దగ్గరగా వచ్చి, ఆగాయి.

రేవతి వణికిపోయింది. చిన్నగా కళ్ళు సగం తెరచి వోరగా చూసింది అదిరిపోయింది.

భ్రమ కాదు కదా! గిచ్చుకుంది. చురుక్కుమంది శరీరం

అవే చెప్పులు. అదే రకం ధోవతి పట్టంచు ధోవతి.

ప్రభాకరం తన భర్త. తనకోసం వచ్చాడా? అయ్యో!

ఎందుకొచ్చినట్టు? ఒకవేళ చంపడానికి రాలేదు కదా? ఇక్కడ గొంతు పిసికి చంపితే! అదే కావాలి. తనకు ముక్తి.

"రేవతీ!" మరలా పిలిచాడు

ఆ పిలుపులో ప్రశాంతత. ప్రియుని పిలుపులో వుండే మాధుర్యం. ఆదరణ వుంది

"రేవతీ! నిన్నింటికి తీసుకెళ్ళడానికి వచ్చాను-మన ఇంటికి"

అబ్బా! నన్నింటికి తీసుకువెళతాడా? ఇది సంభవమేనా? తనని కాదనిపోయిన భార్యని మరలా ఆహ్వానిస్తున్నాడా ఇంటికి? ఆయనకి తన సంగతి పూర్తిగా తెలియదేమో. అవును తెలిసివుండదు. లేకపోతే తనని రమ్మని పిలవడమేమిటి?

ఒకవేళ ఇంటికి తీసుకుపోయి గప్‌చిప్‌గా చంపుతాడా? ఇక్కడయితే గోలవు

తుందనుకున్నాడేమో! ఛ! అదే అయితే ఆ గొంతులో ఆ మాధుర్యం ఎలా వుంటుంది? ఏమిటో! బొత్తిగా అయో మయంగా ఉంది.

కళ్ళు తెరిచింది రేవతి. శరీరంలో ఏదో శక్తి ప్రవేశించినట్టయింది. ఏమీ తెలీధు మంత్రముగ్ధురాలై లేచింది

ప్రభాకరం వెనక్కి తిరిగాడు. రేవతి మంచం దిగింది నర్సు నవ్వుతూ వచ్చి 'విష్ యు బెస్ట్ ఆఫ్ లక్' అంది. రేవతి శిరం వంగిపోయింది

"నడవగలవా రేవతీ!" అన్నాడు ప్రభాకరం వెనక్కి తిరిగి.

తల వూపింది నాలుగడుగులు వేసింది కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. తూలిపోయింది. ప్రభాకర్ చేతులు రేవతిని పొదివి పట్టుకున్నాయి. అంతే రేవతి కళ్ళు మూసుకుపోయాయి

* * *

రేవతి కళ్లు తెరిచింది. ఫాను తిరుగుతోంది. చల్లగా హాయిగా వుంది. చుట్టూ చూసింది. తన పెళ్ళినాటి ఫోటో కనిపించింది అదే తన గది. గదిలో మరో ఫోటో లేదు. గదిలో ఏ మార్పూలేదు.

తన భర్త తనను యింటికి తీసుకొచ్చాడు అనుకోగానే మనసు ఉప్పొంగింది.

తన భర్త తనకోసం ఎదురుచూస్తున్నాడా? ఏడీ? ఆయన్ను తనివితీరా చూడాలి. తను చచ్చిపోయినా ఫరవాలేదు తను తెగిన గాలిపటంలా నశించిపోదు. భర్త చేతుల్లో చచ్చిపోతుంది. పసుపు కుంకుమతోనే వెళ్ళిపోతుంది. అనుకోగానే మనసు తేలికపడింది. కళ్లు తెరిచింది ఎదురుగా ప్రభాకరం కూచున్నాడు.

"ఏమండీ!" పిలిచింది. కన్నీళ్ళు కారుతున్నాయి. పెదాలు వణుకుతున్నాయి "మీరు నన్ను తాకారు ఈ శరీరం మలినమయిపోయింది. నేను పనికిరానండీ" అని బావురుమంది

"ఏడవకు రేవతీ!"

"నేను చెయ్యరాని పని చేశానండీ మీరు నన్ను క్షమించానంటే హాయిగా చచ్చిపోతాను!" మళ్ళీ బావురుమంది

"వూరుకో రేవతీ! బాధపడకు."

ఇంత విశాల హృదయుడినా నేను మోసగించింది—అన్న భావం రేవతి హృదయాన్ని బద్దలు చేసింది. పిచ్చిదానిలా భర్త కాళ్ళమీద పడిపోయింది. పగిలిన రేవతి గుండె తిరిగి కొట్టుకోనే లేదు. *